# పునరపి...

ఎడారిలో ఒయాసిస్సు, కారు చీకటిలో కాంతిరేఖ మొదలైన పడికట్టురాళ్లను వాడేంత అగత్యం లేకపోయినా కాంతారావుకు అలాంటిదే కనిపించింది ఆనాటి దినపత్రికలో బాక్సుకట్టి మరీ వేసేరు ఆ ప్రకటన.

"మద్యపాన వ్యసనం నుండి విముక్తులు కావాలనుకుంటున్నారా.....?" ఇదీ శీర్షిక. ఆ ప్రకటన సారాంశమేంటంటే– ఇటీవలే విదేశాలను ఒంటికాలితో చుట్టివచ్చి అదేనగరంలో ఓ స్టార్‌హోటల్లో బస చేసిన ప్రముఖ హిప్నటిస్టు వెంకటస్వామిగారు హిప్నాటిజం ద్వారా తాగుడు వ్యసనం నుండి తాగుబోతుల్ని రక్షించే తరుణోపాయం కనుక్కున్నారు(ట). ఆయనను సంప్రదించి యిప్పటికే అనేకమంది రోగులు (తాగుడు రోగం అని విజ్ఞుల, అనుభవజ్ఞుల అభిప్రాయం) స్వస్థత పొందారు(ట). వాళ్ల ఫోటోలతో సహా సాక్ష్యం చెప్పిస్తూ మరీ రూపొందించేరు ప్రకటన. తాగుబోతు వ్యసన తీవ్రత, స్వభావాన్ని (ఉత్తరోత్తరా ఆర్థిక స్థితి గతుల్ని) విచారించేక ఫీజు నిర్ణయిస్తారు(ట).

కాంతారావు ఆ ప్రకటన చదివీ చదవగానే ఆలోచనలో పడ్డాడు. ఆ ఆలోచనలన్ని తన మిత్రుడు బలరాం గురించే. బలరాం వంటివాడు తాగుడుకు బానిసయ్యేడంటే అది ఆలోచించాల్సిన విషయమే అంటారు అతన్ని బాగా ఎరిగున్న కొందరు తాగిన వాళ్ల మధ్య వుండడంగానీ, బార్లు, సారా అంగళ్లు మొదలైన ప్రదేశాలలో నిలబడడం గానీ అతను సహించేవాడు కాదు. సాధ్యమున్నంత వరకు వాటికి దూరంగా సంచరిస్తూండేవాడు.

ఒకరోజు స్నేహితుడి పెళ్లి విందుకు హాజరయ్యేడు. భోజనాలకు ముందు స్నేహితులందరూ ఓ గదిలో కూర్చుని తాగడం మొదలెట్టేరు!

"నేను బైటికెళ్తాను". అన్నాడు బలరాం.

"ఏం?"

"నాకసలు ఆ వాసనే పడదు".

"వచ్చే జన్మలో సారాసీసాపై పుడతావు."

"సారాసీసాగానా?" నవ్వేడు బలరాం.

"అవును. నేను తాగను. తాగుబోతులంటి నాకసహ్యం అనే వాళ్లందరికీ లోపల్లోపల అదెలా వుంటుందో ఓ సారి రుచి చూద్దామని వుంటుంది. కాని తాగరు. తాగలేరు. అన్నెం పున్నెమూ ఎరగని కోరికను నిలువునా హత్య చేసిన పాపం ఊరికే పోతుందా... జన్మ జన్మలకు పట్టికుదుపుతుంది. నువ్వు చేసిన పాపం నెక్స్టు జన్మలో నిన్ను ఓ సారాసీసాగా పుట్టిస్తుంది. నీలో ఎంత సారా..... పోనీ.... బ్రాందీ.... అదీగాకుంటే.... విస్కీవున్నా, దాన్ని రుచి చూడాలన్న తాపత్రయం నీలో వున్నా ఒక్క బొట్టుకూడ తాగలేవు. ఆఖరికి కుమిలి కుమిలి చచ్చి, పెటిళ్ళున పగిలిపోయి ఏ పెంటకుప్పలో నో కలుస్తావు." అంటూ గ్లాసులోకి ఒంచుకోకుండా, నీళ్లసలే కలుపుకోకుండా విస్కీ సీసా ఎత్తి గటగటా తాగేసేడు ఆస్నేహితుడు.

పకాల్న నవ్వేడు బలరాం. "నీ మొహం నీ మోర" అన్నాడు.

"తర్వాత్తర్వాత నువ్వే చూస్తావు."

ఇంటి కొచ్చేడు బలరాం.

ఆ రాత్రంతా దాన్ని గురించే ఆలోచించేడు. మధ్య మధ్యన "ఏమిటి తాగుడు గురించి యిలా ఆలోచిస్తున్నాను" అని అనుకుంటూనే ఆలోచించేడు. 'నిజంగా తాగడంలో అంతటి గొప్ప అనుభూతి వుందా' అని అనుకున్నాడు ఆఖర్న.

అదే స్నేహితులు మళ్లీ యింకో బర్త్‌డే పార్టీలో కలిసేరు. ఎప్పట్లానే మందు సేవనం ప్రారంభించేరు. ఆనవాయితీగా బలరాంకి కూడా ఆఫర్ చేసేరు ఓపెగ్గు.

'ఊహూ నాకొద్దు' అని అన్నాడే గానీ అతని చూపులు, ఆలోచనలు దాని చుట్టే తిరుగుతున్నాయి.

"పర్లేదు పుచ్చుకో, ఒక్కసారికి ఏం కాదులే", బలవంతంగా గ్లాసు అతని చేతిలో పెట్టేడు హోస్టు.

ఆ గ్లాసును పట్టుకున్నాడో లేదో చేతివేళ్లలో సన్నటి వణుకు ప్రారంభమయింది బలరాంకి. ఆ వణుకును చూసి స్నేహితులేమయినా ఎగతాళిగా చెప్పుకుంటారేమోనని క్షణంపాటు తటపటాయించేడు.

"ఊఁ కానీ..... చీర్స్"

గ్లాసుల గలగలలో, రంగు ద్రవపు మిలమిల, చేతనాంతశ్చేతనల ఘర్షణలో బలరాం జీవితంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టబడింది.

తర్వాత బలరాం చాలా సార్లు తాగేడు. కొన్నాళ్ల పాటు 'తాగడంలో తప్పులేదు. ఎటొచ్చీ దానికి బానిస అవడమే నిందార్హం. తన డబ్బులతో కాక ఎవరేనా యిప్పిస్తేనే పుచ్చుకోవాలి' అనుకున్నాడు. అలానే కొన్నాళ్ల పాటు నెట్టుకొచ్చేడు.

తనకి ఎమ్మెస్సీలో గోల్డు మెడల్ రావడంతో మిత్రులకు పార్టీ యివ్వడానికి నిశ్చయించుకున్నాడు బలరాం.

సొంత డబ్బు వెచ్చించి రకరకాల మద్యాన్ని తెప్పించాడు.

"పార్టీ యిస్తే యిలా వుండాలి". అన్నారు స్నేహితులు. ఆ మాటలకు ఎంతగానో పొంగిపోయేడ సహజంగానే.

అప్పట్నుంచి సొంత డబ్బుతో తాగుతూ, మిత్రులకు తాగిస్తూ రావడం ప్రారంభించేడు.

పెళ్లయిందతనికి.

కట్నానికి ఆశపడి చేసుకున్నాడు గానీ ఆ అమ్మాయి పట్ల అతనికి యిష్టంలేదు. శోభనపు రాత్రి నుండే కొట్లాటలు ప్రారంభమయ్యేయి. ఆ యిద్దరి ఆలోచనలకు, అలవాట్లకు, నడవడులకు ఎక్కడా పొంతన కుదరదని తెలిపోయింది. అయినా తప్పనిసరిగా పయనించాల్సిన దూరం ఆ యిద్దర్నీ ఓ గాట కట్టేసింది.

చింతలు, వలవంతలు, గోరంతలు, కొండంతలు.

బలరాం తాగడం ఉధృతం చేసేడు.... సొంత డబ్బుతోనే కాక అప్పులు చేసి తాగేదశను కూడా అందుకున్నాడు.

సరిగ్గా ఆ సమయంలోనే తెలిసింది కాంతారావుకి, బలరాం సంగతి. కొన్నేళ్ల వనవాసం (ఉద్యోగ రీత్యా) తర్వాత సొంత ఊరికి బదిలీ అయింది. ఆ యిద్దరికీ 'ఒరే' అనుకునేంత చనువుంది. బంధువులు కాకపోయినా బావా అంటూ వరసలు కలుపుకుని పిల్చుకునే అనుబంధమూ వుంది.

చదువులో మిగతా జీవితంలోనూ ఆణిముత్యం అనిపించుకున్న బలరాం బొగ్గుముక్క అయ్యేడని తెలిసి బాధపడ్డాడు. అతని తాగుడ్ని కళ్లారా చూసి కృంగిపోయేడు. హితబోధ ప్రారంభించేడు.

"నీ బోధలు వినడానికి నాకేం అభ్యంతరం లేదు. దయచేసి ఒక్క బాటిల్ అరిస్టోక్రాట్ యిప్పించు. సీసా ఖాళీ చేస్తూ నీ బోధల్ని నాలో నింపేసుకుంటాను". అన్నాడు బలరాం హేళనగా.

కాంతారావు కృంగిపోలేదు.

బలరాం కోసం యింటికెళ్లినప్పుడల్లా అతని భార్య దీనవదనం చూసి అతడి గుండెలు తరుక్కుపోయేవి. క్రితం రాత్రి తనను ఎలా హింసించిందీ ఆమె ఎక్కిళ్ల దుఃఖంతో కలిపి మరీ చెబుతూంటే నరాలు తెంపుకున్నట్టుండేది. స్నేహితుడి శ్రేయస్సు నిజంగా కోరుకుంటున్న వాడు కనుక అతన్నెలాగయినా ఆ వ్యసనం నుండి బైటపడేసి ఆ సంసారాన్ని చక్క దిద్దాలనుకున్నాడు.

అదృష్ట వశాత్తు అప్పుడే "ఆల్కహాలిక్స్ అనానిమస్" వాళ్ల స్వర్ణోత్సవ కార్యక్రమాలు జరుగుతున్నట్టు తెలిసింది కాంతారావుకి. అక్కడికి తీసుకెళ్లేడు బలరాంని బలవంతంగా. అక్కడ

ప్రముఖ మాజీ తాగుబోతుల చరిత్రలు విన్నాడు. సైక్రియాట్రిస్ట్ల ప్రసంగాలు విన్నాడు. ఆఖర్న అన్నాడు.... "ఇప్పుడప్పుడే నేనీ సంస్థలో చేరను. వాళ్ల మాదిరి తాగుడులో తల పండిపోయేక అప్పుడు చేరతాను".

పై ప్రవ్వేరచక తప్పలేదు కాంతారావుకి.

అదేదో తాగుడుకు, విరుగుడుగా పసరు పోస్తారని విని అక్కడికి లాక్కెళ్లేడు. పసరు తాగింతర్వాత మత్తుగా కనిపించేడు బలరాం.

"మళ్లీ యింకోసారి ఆ పసరు పోయించవూ" అనడిగేడు కాంతారావుని.

అవాక్కయ్యేడతను.

"ఏమిటా తలతిక్క.... ?" విసుక్కున్నాడు కాంతారావు.

"ఫారిన్ విస్కీ కన్నా ఘాటుగా వుంది."

పసరు కూడా పన్చెయ్యలేదు. తర్వాత ఏవేవో మూలికలు.... ఏవేవో కేప్సూల్సు..... కనపడ్డ ప్రతి మార్గానా పోయేడు. ఫలితం లేదు.

మళ్లీ యిన్నాళ్లకు ఆ ప్రకటన చూసేడు.

'ఇందుకూ' అని ప్రత్యేకించి చెప్పలేం గానీ ఎందుకనో ఆ ప్రకటన మీద నమ్మకం కుదిరింది కాంతారావుకి. నేరుగా బలరాం యింటికెళ్లాడు.

ఆఫీసుకు సెలవు పెట్టి భార్యతో కొట్లాట పెట్టుకున్నాడు బలరాం. కాంతారావు వెళ్లడంతో అది కాస్తంత సద్దుమణిగింది.

"ఒరే రాస్కెల్.... త్వరగా తయారవ్వు."

"ఎక్కడికి?"

ప్రకటన చూపించేడు కాంతారావు.

"నేన్రాను."

"మక్కెలిరుగుతాయి". చనువుకొద్దీ బెదిరించేడు కాంతారావు.

"మీ ఆరోగ్యం పట్ల అన్నయ్యగారికున్న శ్రద్ధ మీకు లేకపాయె అంది బలరాం భార్య.

"ఆట్టే పేలకు".

"తమరు నోర్మూసుకుని నా వెంట కదలవలసింది". కాంతారావు కొద్దిగా వెటకారం మేళవించి మరీ అన్నాడు.

ఇద్దరూ కలిసి నేరుగా హిప్నటిస్ట్ వెంకటస్వామి దగ్గరికెళ్లేరు. అదృష్టం అదేమిటో గానీ వెళ్లగానే అపాయింట్‌మెంట్ దొరికింది.

ప్రాథమిక పరీక్షలయ్యేక "ఫీజు వెయ్యిదాటుతుంది" అన్నాడు వెంకటస్వామి మంద్ర







స్వరంతో.

"కావాలంటే రెండు వేలయినా యిస్తాను. ముందు ఆ రాస్కెల్ని బాగు చెయ్యండి" అన్నాడు కాంతారావు.

దాదాపు అర్ధగంటసేపు సజేషన్స్ యిచ్చీ యిచ్చీ బలరాం మీద తన అస్త్రం ప్రయోగించేడు వెంకటస్వామి. గంట తర్వాత–

"ఇహ చస్తే సారాముట్టడు" అని భరోసా యిచ్చి" కావాలంటే పరీక్షించండి". అంటూ ఓ విస్కీ బాటిల్ తెప్పించి బలరాంకి యిచ్చేడు వెంకటస్వామి.

విస్కీ బాటిల్ వంక తదేకంగా చూసీ చూసీ, తటాల్న అందుకుని గటగటా తాగేసేడు బలరాం.

తాగుడు వ్యసనం అంటే ఏమనుకుంటున్నారు మరి! □